


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 31-05-2026 | సంపుటి - 28 | సంచిక -05 | రూ : 4 | పేజీలు: 8


## కరాచీ నీటి సంక్షోభం.. పాక్‌కు చుక్కలు చూపిస్తున్న భారత్

- పాక్‌కు తగిలిన సింధు జలాల ఒప్పందం నిలిపివేత సెగ
- ఢిల్లీ వ్యూహాత్మక నిర్ణయంతో కరాచీలో తీవ్ర సంక్షోభం
- దాహంతో అల్లాడుతున్న కరాచీ నగర జనాభా 2లో
- నీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్న ప్రజలు
- నిలువు దోపిడీ చేస్తున్న అక్రమ వాటర్ మాఫియా



## మేం మోటార్లకు మీటర్లు పెట్టకపోతే పోటీ నుంచి వైదొలుగుతారా?

- భారాసకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- ప్రతి ధాన్యపు గింజను కొంటాం
- జూన్ 15 తర్వాత మోదీ, కిషన్‌రెడ్డి సంగతి తేలుస్తాం
- ట్రాక్టర్లలో వడ్లు తీసుకెళ్లి భాజపా నాయకుల ఇళ్ల ముందు పోస్తాం
- ఎన్నికల నాటికి హరీశ్‌రావు భారాసలో ఉండరు
- తుమ్మిడిహెట్టి కోసం 2లో



మాట్లాడతామంటే.. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం



## హైడ్రా చర్యలు గర్హనీయం

- కూకట్‌పల్లిలో కూల్చివేతల ప్రాంతాన్ని పునరుద్ధరించాల్సిందే
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: ఓ వైపు కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ, మరోవైపు స్వయంగా ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాత్రికి రాత్రి కూల్చివేతలు చేపట్టిన హైడ్రా తీరు గర్హనీయమని హైకోర్టు తప్పుబట్టింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో సర్వే నం.1003 నుంచి 1006 వరకు ఉన్న 13.17 ఎకరాల స్థలం ఈనెల తరువాయి 2లో



## మళ్ళీ రంగంలోకి ‘ఆపరేషన్ సిందూర్’

- త్రివిధ దళాల మధ్య సమన్వయం పెంపు
- ఆధునిక యుద్ధ తంత్రంపై ప్రత్యేక దృష్టి
- సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాటు
- సైనికులు, పౌరుల రక్షణకు ప్రాధాన్యం
- అధికారిక సమాచారాన్నే నమ్మాలని ప్రజలకు పిలుపు 2లో

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

- రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను
- చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం
- అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం
- పశ్చిమ అలజడుల కారణంగానే ఈ తుఫానులు అని వెల్లడి
- ప్రస్తుతానికి ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు 2లో





## దేశంలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం 9 మంది అరెస్ట్

- భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన ఢిల్లీ పోలీసులు
- అణు కేంద్రాలు, విమానాశ్రయాలపై దాడులకు ప్రణాళికలు 2లో
- నిందితుల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు స్వాధీనం



2లో


## 11 వేల ఏళ్ల భారత చరిత్రకు వాషింగ్టన్‌లో శాశ్వత వేదిక

- అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ‘ఇండియా హెరిటేజ్ సెంటర్’ ఏర్పాటుకు ప్రణాళిక
- 11 వేల ఏళ్ల భారత నాగరికత, చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యం
- ప్రవాస భారతీయుడు డాక్టర్ అమితాబ్ శర్మ నేతృత్వంలో రూ.115 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్ట్
- అత్యాధునిక వర్చువల్ రియాలిటీ టెక్నాలజీతో 10 గ్యాలరీలలో ప్రదర్శనలు
- భారత చరిత్రపై ఉన్న అపోహలను తొలగించి, అసలైన వాస్తవాలు చూపించాలన్నదే ఉద్దేశం

## సామాన్యులపై ప్రభావం జూన్ 1 నుంచి అమలులోకి కీలక మార్పులు!

- ఎల్పీజీ సిలిండర్ల ధరలను సమీక్షించనున్న ఆయిల్ కంపెనీలు
- క్రెడిట్ కార్డుల రివార్డులు, ఛార్జీలలో మార్పులు
- జూన్ 14తో ముగియనున్న ఉచిత ఆధార్ అప్‌డేట్ గడువు
- ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించే అవకాశం 2లో





## ఇరాన్ యుద్ధం.. తెరపైకి యూఏఈ రహస్య దాడులు?

2లో

ఇంధన కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిగినట్లు సమాచారం

ఎమిరేట్స్‌పై 2,800 క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడినట్లు టాక్

# మేం మోటార్లకు మీటర్లు పెట్టకపోతే పోటీ నుంచి వైదొలుగుతారా?

హైదరాబాద్: ''వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినా, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేసినా మేం ఎన్నికల్లో పోటీ చేయం. మరి మేం మోటార్లకు మీటర్లు పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ కొనసాగించినా ఎన్నికల్లో పోటీ నుంచి భారాస వైదొలుగుతుందా'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రైతు డిస్కం ఏర్పాటైన తర్వాత కూడా రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శనివారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల అంశంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి పంటలో రైతులు కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకోకపోతే వరి, ఇతర పంటల కొనుగోళ్లపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ అంశంలో జూన్ 15 తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల సంగతి తేలుస్తామని సీఎం హెచ్చరించారు. భారాస అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలపై ఘాటైన విమర్శలు చేశారు.

**స్మార్ట్ మీటర్ల పునాది భారాసదే**

''ఉచిత విద్యుత్ రద్దు చేస్తున్నట్లు.. మోటార్లకు మీటర్లు, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నట్లు.. ఉచిత విద్యుత్ ఎత్తేయడానికే రైతుడిస్కం అని భారాస నేతలు చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలు. 2017 జూన్ 4న అప్పటి భారాస ప్రభుత్వమే స్మార్ట్ మీటర్లకు పునాది వేసింది. తెలంగాణ డిస్కంలు, కేంద్ర ఇంధనశాఖ ఒప్పందం చేసుకున్నాయి. ఆ పార్టీ హయాంలోనే 29,632 స్మార్ట్ మీటర్లు అమర్చారు. నాడు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నవారే నేడు ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. కానీ కేంద్రం అప్పుడైనా... ఇప్పుడైనా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన విధించలేదు. కేసీఆర్ ఇప్పుడు రైతుల్ని భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఆలోచన కాంగ్రెస్‌దే. 1999 ఎన్నికల్లోనే హామీ ఇచ్చింది. కేసీఆర్ కుటుంబ డీఎన్ఏనే అబద్ధాలతో ఉంది. హిల్ట్‌పాలసీపై, 111 జీవో ప్రాంతంలో క్రషర్లపై ఆరోపణలు చేశారు. క్రషర్లు కొనసాగాలంటే నెలకు రూ.50 లక్షల లంచాలివ్వాలని భారాస నేతలు బ్లాక్‌మెయిల్ చేశారు. హైడ్రా వెళ్లి ఆ క్రషర్లను కూల్చివేసింది. ఉద్యమంలో అబద్ధాలు ఆడారు. ప్రజల్ని మోసం చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్నారు. 'ఈదులకుంట' ఆక్రమణల్ని కూల్చేశాం. హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ నవీన్‌రావు ఈ అంశం గురించి ఎందుకు మాట్లాడట్లేదు'' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## మళ్ళీ రంగంలోకి 'ఆపరేషన్ సిందూర్'

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం త్రివిధ దళాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సరిహద్దుల్లో ప్రస్తుత ప్రశాంతత కేవలం తాత్కాలికమేనని తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని స్పష్టం చేశారు.

**పటిష్ఠంగా వ్యూహాలు**

ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా త్రివిధ దళాల మధ్య సమన్వయం పెంచుతున్నట్లు ద్వివేది తెలిపారు. యుద్ధరంగంలో ప్రతి కదలిక స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అందుకే సైనికులతో పాటు పౌరుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 24 గంటలూ రక్షణ దళాలు అప్రమత్తంగా ఉంటున్నాయని వివరించారు.

**సమాచార యుద్ధంలో ప్రజల పాత్ర**

సమాచార యుద్ధంలో విజయం సాధించాలంటే దేశ ప్రజల మద్దతు ఎంతో అవసరమని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలని పిలుపునిచ్చారు. దేశమంతా ఒకే తాటిపైకి వచ్చినప్పుడే శత్రువుపై విజయం సాధ్యమవుతుందని వివరించారు.

## సామాన్యులపై ప్రభావం: జూన్ 1 నుంచి అమలులోకి వచ్చే కీలక మార్పులు!

జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక నిబంధనలు మారబోతున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డులు, ఆధార్ అప్‌డేట్ వరకు అనేక అంశాల్లో కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు నేరుగా సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం చూపనున్నాయి. ప్రతి నెలా మాదిరిగానే, ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు జూన్ 1న ఎల్పీజీ సిలిండర్ల ధరలను సమీక్షించనున్నాయి. అంతర్జాతీయ ఇంధన ధరలకు అనుగుణంగా గృహ, వాణిజ్య సిలిండర్ల ధరలలో మార్పులు ఉంటాయి. ఇది వినియోగదారుల ఖర్చులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా సిలిండర్ ధరలను ప్రతి నెల సమీక్షిస్తారు. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పాలసీ వైఖరిని అనుసరించి, పలు బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణాలపై వడ్డీ రేట్లను సవరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఎఫ్‌డీ రేట్లను తగ్గించాయి. అలాగే, కొన్ని బ్యాంకులు తమ క్రెడిట్ కార్డుల నిబంధనలను మారుస్తున్నాయి. రివార్డు పాయింట్లు, లావాదేవీల ఛార్జీలు, లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాల్లో మార్పులు ఉండనున్నాయి. సంబంధిత బ్యాంకులు జారీ చేసిన కొత్త నిబంధనలను సరిచూసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అత్యంత ముఖ్యంగా, ఆధార్ కార్డులో వివరాలను ఉచితంగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు యూఐడీఏఐ కల్పించిన గడువు జూన్ 14తో ముగియనుంది. ఆ తర్వాత చిరునామా వంటి వివరాలను మార్చుకోవాలంటే ఫీజు చెల్లించాల్సి రావచ్చు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మ్యూచువల్ ఫండ్ల లావాదేవీలను వేగవంతం చేసేందుకు తెచ్చిన కొత్త నిబంధనలు కూడా జూన్ నుంచి దశలవారీగా అమల్లోకి రానున్నాయి.

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను...
## పట్టపగలే చీకట్లు!

రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

## 11 వేల ఏళ్ల భారత చరిత్రకు వాషింగ్టన్‌లో శాశ్వత వేదిక

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో భారత దేశ 11 వేల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర, నాగరికత, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా ఒక శాశ్వత మ్యూజియం కొలువుదీరనుంది. సుమారు ఎనిమిదేళ్ల పరిశోధన, ప్రణాళిక తర్వాత 'ఇండియా హెరిటేజ్ సెంటర్' పేరుతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారతీయ అమెరికన్ విద్యావేత్త, కమ్యూనిటీ నాయకుడు డాక్టర్ అమితాబ్ శర్మ ఈ బృహత్కార్యానికి నేతృత్వం వహిస్తున్నారు. భారతదేశ చరిత్రను ఇప్పటివరకు విదేశీ దృక్కోణంలో, అసంపూర్తిగా చిత్రీకరించారని, దాని అసలైన వైభవాన్ని ప్రపంచానికి సరైన రీతిలో చూపించలేదని డాక్టర్ అమితాబ్ శర్మ అన్నారు. "మన కథను మనమే బలంగా, సమగ్రంగా చెప్పుకోవాల్సిన సమయం వచ్చింది. మన ఘనమైన నాగరికత, వారసత్వం, ప్రపంచానికి మనం అందించిన సేవలను తెలియజేయడమే ఈ మ్యూజియం ముఖ్య ఉద్దేశం" అని ఆయన వివరించారు. ఈ మ్యూజియంను సుమారు 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇందులో 10 ప్రత్యేక గ్యాలరీలు, 350 సీట్ల ఆడిటోరియం, ఒక లైబ్రరీ, గిఫ్ట్ సెంటర్ ఉంటాయి. సందర్శకులకు ఒక ప్రత్యేక అనుభూతిని అందించేందుకు వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), ఇంటరాక్టివ్ డిస్‌ప్లేల వంటి అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించనున్నారు. సింధు లోయ నాగరికత, వేద సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు, యోగా, ఆయుర్వేదం, స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఆధునిక భారతదేశం వరకు వివిధ అంశాలను ఈ గ్యాలరీలలో ప్రదర్శిస్తారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 12 నుంచి 14 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 115 కోట్లు) వరకు ఖర్చవుతుందని అంచనా. 501(c)(3) నాన్ ప్రాఫిట్ సంస్థగా నమోదైన ఈ సెంటర్ కోసం విరాళాలు, కార్పొరేట్ స్పాన్సర్‌షిప్‌ల ద్వారా నిధులు సమీకరించనున్నారు. చారిత్రక సమాచారంపై భవిష్యత్తులో ఎలాంటి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు, ప్రతి అంశాన్ని ధ్రువీకరించడానికే సుమారు ఎనిమిదేళ్లు పట్టిందని శర్మ తెలిపారు. కేవలం భారత సంతతికే కాకుండా అమెరికన్లు, ఇతర దేశస్థులకు కూడా భారత చరిత్రపై అవగాహన కల్పించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా భారత చరిత్ర గురించి సరైన అవగాహన లేని యువ తరానికి వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు, అధిక సంఖ్యలో పర్యాటకుల రాకపోకలు ఉండటంతో వాషింగ్టన్ డీసీని ప్రాధాన్య ప్రదేశంగా ఎంచుకున్నామని, ఇప్పటికే స్థల అన్వేషణ ప్రారంభించామని ఆయన తెలిపారు. "ఇది నా ఒక్కడి ప్రాజెక్టు కాదు, యావత్ భారత సమాజం ప్రాజెక్టు" అని ఆయన అన్నారు.

## దేశంలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం: 9 మంది అరెస్ట్

దేశంలో భారీ ఉగ్రవాద కుట్రను ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ భగ్నం చేసింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తోనూ, పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీ, ముంబై సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించేందుకు వీరు పథకం రచించినట్లు తెలిపారు. దేశంలోని అణు కేంద్రాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారని తెలుస్తోంది. అరెస్టయిన వారిలో ఢిల్లీ, ముంబై, పంజాబ్‌కు చెందినవారితో పాటు కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా ఈ ముఠాపై నిఘా పెట్టిన పోలీసులు, సరైన సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉగ్ర ముఠాకు సరిహద్దు ఆవల నుంచి అందుతున్న సహకారం, నిధుల సమీకరణ, విదేశీ హ్యాండ్లర్ల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఉగ్రవాద దాడుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది.

## ఇరాన్ యుద్ధం.. తెరపైకి యూఏఈ రహస్య దాడులు?

ఇరాన్‌పై ఇప్పటి వరకు అమెరికా, ఇజ్రాయెల్ మాత్రమే దాడులు చేశాయని యావత్ ప్రపంచం భావిస్తూ వచ్చింది. కానీ, పశ్చిమాసియా దేశమైన యూఏఈ కూడా ఇరాన్‌పై దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. యుద్ధంలో భాగంగా గల్ఫ్ దేశాల్లోని భూభాగాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడి చేసిన విషయం తెలిసిందే. తమ దేశంపై దాడిని తీవ్రంగా పరిగణించిన యూఏఈ ఈ దాడులు చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది.

**ఇంధన వనరులపై**

అమెరికా, ఇజ్రాయెల్ ఇచ్చిన నిఘా సమాచారంతో యూఏఈ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. హర్మూజ్ జలసంధిలోని దీవులు, ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లపై బాంబుల వర్షం కురిపించినట్లు నివేదికలు చెబుతున్నాయి. గ్యాస్ మౌలిక వసతులపై ఇరాన్ చేసిన దాడులకు ప్రతీకారంగానే యూఏఈ ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.

**యూఏఈపైకే ఎక్కువ క్షిపణులు**

అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరిస్తోందనే కోపంతో యూఏఈని ఇరాన్ తీవ్రంగా టార్గెట్ చేసినట్లు నివేదిక పేర్కొంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏకంగా 2,800కు పైగా క్షిపణులు, డ్రోన్లను ఎమిరేట్స్‌పైకి ఇరాన్ ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ కంటే కూడా యూఏఈపైనే ఇరాన్ ఎక్కువ దాడులు చేసినట్లు పత్రిక కథనంలో రాసింది.

**సౌదీ అరేబియాతో విభేదాలు**

ఇరాన్ దాడులపై యూఏఈ కఠిన వైఖరి అవలంబించినట్లు సమాచారం. గల్ఫ్ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై ఉమ్మడి సైనిక చర్యకు దిగాలని ప్రతిపాదించగా సౌదీ అరేబియా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. దాడులు ఆపాలని యూఏఈపై ఒత్తిడి తేవాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సౌదీ కోరినట్లు సమాచారం.

ఇజ్రాయెల్‌తో పెరిగిన రక్షణ బంధం?

యుద్ధ సమయంలో యూఏఈ, ఇజ్రాయెల్ మధ్య రక్షణ సహకారం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్ క్షిపణుల నుంచి రక్షణ కోసం ఇజ్రాయెల్ తన 'ఐరన్ డోమ్' వ్యవస్థలను యూఏఈకి పంపినట్లు సమాచారం. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, నిఘా సంస్థల అధిపతులు రహస్యంగా యూఏఈలో పర్యటించి వ్యూహాలు రచించినట్లు కథనాలు వస్తున్నాయి.

## కరాచీ నీటి సంక్షోభం
## పాక్‌కు చుక్కలు చూపిస్తున్న భారత్

భారత్ గీసిన జల వ్యూహం పొరుగు దేశాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తోంది. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఢిల్లీ తీసుకున్న 'సింధు జలాల ఒప్పందం నిలిపివేత' నిర్ణయం సెగ.. ఇప్పుడు పాక్ ఆర్థిక రాజధాని కరాచీకి గట్టిగా తగులుతోంది. ఢిల్లీ పెంచిన వ్యూహాత్మక ఒత్తిడి వల్ల ఆ దేశంలో నీటి లభ్యత దారుణంగా పడిపోయింది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా కరాచీ మహానగరం ఇప్పుడు చుక్క నీటి కోసం అల్లాడిపోతోంది.

**కరాచీలో కన్నీరు**

సింధు ఒప్పందానికి బ్రేక్ పడటంతో కరాచీ నగరంలో నీటి సంక్షోభం ముదిరింది. దాదాపు మూడు కోట్ల జనాభా ఉన్న ఈ నగరంలో 70 శాతం మందికి పైగా నీళ్లు అందడం లేదు. రోజుకు 400 మిలియన్ గ్యాలన్ల నీటి కొరత వేధిస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. రెండు వారాలుగా చుక్క నీరు రాకపోవడంతో కరాచీ ప్రజలు అలమటిస్తున్నారు.


**వాటర్ మాఫియా**

ప్రభుత్వ నీటి సరఫరా వ్యవస్థ కుప్పకూలడంతో కరాచీలో 'వాటర్ మాఫియా' రాజ్యమేలుతోంది. ఇక్కడి ప్రజలు తాగునీటి కోసం ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపైనే పూర్తిగా ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమ నిర్వాహకులు రేట్లను ఇష్టారాజ్యంగా పెంచేసి దోచుకుంటున్నారు. ఎండలు మండిపోతున్న వేళ కరాచీ ప్రజలకు ఈ వాటర్ ట్యాంకర్లు కొనడం భారంగా మారింది.

**పాలకుల చేతకానితనం**

ఈ నీటి సంక్షోభం పాకిస్థాన్‌లో పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది. సింధ్ ప్రావిన్స్‌లో దాదాపు ఇరవై ఏళ్లుగా అధికారంలో ఉన్నా కరాచీ నీటి సమస్యను పీపీపీ ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందని ప్రతిపక్ష జమాతే ఇస్లామీ అధినేత హఫీజ్ నయీమ్ ఉర్ రెహమాన్ మండిపడ్డారు. నగరంలో నీటి కొరత లేదంటూ మేయర్ చేస్తున్న ప్రకటనలు పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. కరాచీలో కనిపిస్తున్న ఈ నీటి సంక్షోభం వెనుక భారత్ వ్యూహాత్మక పట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

## హైడ్రా చర్యలు గర్హనీయం




హైదరాబాద్: ఓ వైపు కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ, మరోవైపు స్వయంగా ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాత్రికి రాత్రి కూల్చివేతలు చేపట్టిన హైడ్రా తీరు గర్హనీయమని హైకోర్టు తప్పుబట్టింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో సర్వే నం.1003 నుంచి 1006 వరకు ఉన్న 13.17 ఎకరాల స్థలం ఈనెల 25కు ముందు ఎలా ఉందో అలా పునరుద్ధరించాలంటూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, కలెక్టర్, తహసీల్దార్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 26 తెల్లవారుజామున 3.50 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కాంపౌండ్ ఫెన్సింగ్, సెక్యూరిటీ గదులు, ప్రవేశ ద్వారాలను కూల్చివేయడంతోపాటు యంత్రాలను, ఇతర పరికరాలను ధ్వంసం చేసి, విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ మూడు వేర్వేరు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్లు సమర్పించిన ప్రాథమిక ఆధారాలను పరిశీలిస్తే హైడ్రా.. హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులతోపాటు వారు ఇచ్చిన హామీని కూడా ఉల్లంఘించినట్లు స్పష్టంగా ఉందన్నారు. వివాదాస్పద స్థలం ఈనెల 25కు ముందు ఎలా ఉందో 24 గంటల్లో అలా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టడంలో విఫలమైతే పిటిషనర్లు పూర్తి చేసి దానికైన ఖర్చు మొత్తాన్ని ప్రతివాదుల సొంత నిధుల నుంచి వసూలు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత అభిప్రాయాలన్నీ మధ్యంతర ఉత్తర్వులకే పరిమితమని స్పష్టం చేస్తూ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లను జూన్ 4కి వాయిదా వేశారు.

# ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించాలి

* స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ ఉద్దేశ్యం అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ సంఘాల సభ్యుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజా ప్రతినిధుల పాత్రలను పోషిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా అనుభవించారు. సభా నిర్వహణ, చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా తమ ఆలోచనలను




ధైర్యంగా వ్యక్తపరిచారు.మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల భద్రత, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై చర్చించారు.అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యుక్త వయసు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే ఈ స్నేహ సంఘాలు అని, ప్రతి గ్రామ పంచాయతీలో ఈ సంఘాలు ఏర్పాటుఅయ్యాయన్నారు.బాలికల రక్షణ, సంరక్షణ కింద బాల్య వివాహాల నిర్మూలనకు 1098 చైల్డ్ లైన్ నంబర్ లో సంప్రదించాలని అన్నారు.బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే స్థాయికి ఎదగాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ యుక్త వయసు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే ఈ స్నేహ సంఘాలు అని, ప్రతి గ్రామ పంచాయతీలో ఈ సంఘాలు ఏర్పాటు చేశారు.ఈబాలికలు విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. జీవితంలో ఏ రంగాన్ని ఎంచుకున్నా కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం మాక్ పార్లమెంట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, డిప్యూటీ సీ ఈ ఓ శ్రీనివాస్,ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి బీజేపీ కార్యకర్తలే బలమైన శక్తి – మురళీధర్ రావు



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : నేరెడ్మెట్‌లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అలాగే నాయకత్వ లక్షణాలు, పార్టీ నిర్మాణంలో కార్యకర్తల బాధ్యతలు, సేవా కార్యక్రమాల ప్రాముఖ్యతపై విస్తృతంగా మార్గనిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ అభియాన్ ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, కార్యదీక్ష పెంపొందుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మ ఒడి _ అంగన్వాడి

* అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించండి.




గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : రాష్ట ప్రభుత్వం అంగన్వాడీలను ప్రత్యేక దృష్టితో చూస్తూ, అంగన్వాడీల బలోపేతానికి అధిక నిధులను కేటాయిస్తున్నందున, సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై వున్నదని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. గరిడేపల్లి మండలం లోని గానుగబండ గ్రామం లో ఈ రోజు అంగన్వాడీల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలలో పిల్లలను చేర్పించడం ద్వారా అనేక రకాల ప్రయోజనం పిల్లలకు కలుగుతుందని,అంగన్వాడీ ల ద్వారా ప్రతి రోజు పిల్లలకు పౌష్టిక ఆహారం ఇస్తారని, పౌష్టికహారం తీసుకోవడం ద్వారా పిల్లలలో పోషకాహారం లోపం లేకుండా చూసుకోవచ్చునని, నర్సరీ విద్యను కూడా అందిస్తున్నందున అర్హులైన పిల్లలను అందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె తల్లి తండ్రులను కోరారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, జంగం అనిత,పిల్లల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి




మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. శనివారం మహబూబాబాద్ లోని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. చంద్రన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు పొదుపును బోధిస్తూ ఆచరణలో ప్రజలపై ఆర్థిక భారాలు మోపటం తన ద్వంద వైఖరికి నిదర్శనం అని అన్నారు. ఆయిల్ కంపెనీలకు నష్టం వస్తుందని పేరుతో పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్ ధరలను పెంచుకోమని అనుమతినిస్తూ ప్రజలపై వేలకోట్ల బారాలు మోపటం సరికాదని అన్నారు. ఓటర్ ప్రత్యేక జాబితా సవరణ (సర్) పేరుతో తన వ్యతిరేకుల ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. సహజ సర్వసంపదలను కార్పొరేట్ కొత్త సంస్థలకు అప్పచెప్పుతున్న మోడీ ప్రభుత్వం అదాని, అంబానీ చేతిలో బంది అయిందని అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేస్తానని ఇచ్చిన హామీ విస్మరించారని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మే 29,30 తేదీలలో దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిందని,ఈ కార్యక్రమం సిపిఐ(ఎంఎల్) మాస్ లైవ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు పూనెం ప్రభాకర్, డివిజన్ నాయకులు ఊడుగుల రాములు,ఆవుల కట్టయ్య, ఇక బిక్షం, బూర్గుల మోష,గద్దల వెంకటయ్య,తుపాకుల వెంకన్న,బాలు, మహేష్,మహేందర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక్ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం
## నూతన కమిటీ ఏర్పాటు

* ఆత్మగౌరవ సభ విజయవంతానికి కృషి చేయాలి – జోగు కుమారస్వామి


మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి వినాయక్ నగర్‌లోని శ్రీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, కార్మికుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ జూన్ 8న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సభను విజయవంతం చేసేందుకు కార్మికులు, సంఘ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల మే 16న కొందరు సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేపట్టిన బంద్ సందర్భంగా తాపీ మేస్త్రీలను ఉద్దేశించి చేసిన అవమానకర వ్యాఖ్యలు కార్మికుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని



సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఆ వ్యాఖ్యలను సంఘం తీవ్రంగా ఖండిస్తూ, సంబంధిత వ్యక్తులు తాపీ మేస్త్రీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నూతన అధ్యక్షుడు జోగు కుమారస్వామి డిమాండ్ చేశారు. అలాకాకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల గౌరవాన్ని కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా జోగు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా బి. బాలనర్సింహం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమావేశంలో జోగు శ్రీనివాస్, జి. సైదులు, కె.వి. రాకేష్, బి. బాలనర్సింహం, జి. రాజలింగం, జె. అబ్బన్న, ఆర్. నర్సింహం, ఎం. రమేష్, మొహమ్మద్ సాదిక్, జి. కుమార్, ఇ. గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఫుడ్ సేఫ్టీ చట్టం ఉల్లంఘించిన వారిపై రూ.7.91 లక్షల జరిమానా

నల్గొండ, ప్రజాస్ఫూర్తి : ఆహార భద్రత ప్రమాణాల చట్టం2006 నిబంధనలను ఉల్లంఘించిన వివిధ ఆహార వ్యాపార సంస్థలపై నమోదైన 20 అడ్జుడికేషన్ కేసుల్లో మొత్తం రూ.7,91,000 జరిమానాను నల్గొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్ విధించినట్లు అధికారులు తెలిపారు. రిటైల్ దుకాణాలు, హోటళ్లు, కిరాణా షాపులు, తయారీ యూనిట్లు, పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ సెంటర్లు), బేకరీలకు చెందిన కేసులను విచారించిన అనంతరం జరిమానాలు విధించినట్లు తెలిపారు.జిల్లాలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా ఆహార భద్రతా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆహార వ్యాపారులపై కేసులు నమోదు చేసి, సంబంధిత ఆధారాలను అడ్జుడికేటింగ్ అధికారికి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ కేసుల విచారణ సందర్భంగా సహాయ ఆహార




నియంత్రణ అధికారి శ్రీమతి వి. జ్యోతిర్మయి, నల్గొండ జిల్లా ఆహార భద్రతాధికారి ఎన్. శివశంకర్ రెడ్డి హాజరై కేసుల వివరాలను సమర్పించారు.ఈ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి శ్రీమతి వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన సురక్షితమైన ఆహార పదార్థాలను అందించడం ప్రతి ఆహార వ్యాపార సంస్థ బాధ్యత అని అన్నారు. ఆహార వ్యాపారులు తమ వ్యాపారానికి అనుగుణంగా తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందివుండాలని, ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న రైతులు

: సీహెచ్ రాజారెడ్డి.

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని గ్రామాల కల్లాల్లో ఇంకా పెద్దఎత్తున నిల్వఉన్న ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి వెంటనే తర లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శనివా రం సీపీఐ జిల్లా కార్యాలయంలో కావటి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన, జిల్లా సమితి సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రోహిణి కార్తె ప్రారంభమై రైతులు తదు పరి వ్యవసాయ పనులకు సిద్ధమవుతు న్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తికాక పోవడం రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్ల లో జాప్యం, గోనె సంచుల కొరత, తూ




కం ప్రక్రియలో ఆలస్యం, గోదాములకు సరుకుల తరలింపులో సమస్యలు ప్ర భుత్వయం త్రాంగం వైఫల్యాన్ని సూచి స్తున్నాయని విమర్శించారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు ఆర్థికంగా అండగా నిల వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకు రాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహా య కార్యదర్శులు ఆది సాయన్న, ఆకు ల శ్రీనివాస్, జిల్లా నాయకులు చొప్పరి సోమయ్య,జువారి రమేష్,రావుల సదా నందం,మోటె శ్రీశైలం,చామకూర యా కుబ్, తోట రమేష్, ఎం.డీ యూనస్, పండుగ నిర్మల, విజయ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో సమర్ధ పాలనకు నిలువెత్తు నిదర్శనం

* బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు, ప్రజా స్ఫూర్తి:బహుశా వేరే రాష్ట్రాల్లో మాత్రమే ప్రతిభ కనబరచిన ఇంజనీర్లు ఉన్నారా మన రాష్ట్రంలో మన నియోజకవర్గం లో లేరా అనే సందేహం వచ్చి ఉంటుంది. అందుకే వారి ప్రతిభను చూపించడం కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా మన దగ్గర కూడా కూసుమంచి మండల కేంద్రంలో పాత ఎస్ వి ఎస్ కళాశాల వైపు 90 డిగ్రీల కోణంలో రోడ్డు నిర్మాణం చేపట్టి వారి ప్రతిభను చూపించడం జరిగింది. ఐన ఎవరూ గుర్తించక పోవడం వలన వారికి బాధ కలిగించే అంశం. మన పంచాయతీరాజ్ వ్యవస్థ ఎటు పోతుందో అర్థం కావడం లేదు. 118 నుంచి 119 డిగ్రీల కోణంలో నిర్మించ వలసిన సీసీ రోడ్డు 90 డిగ్రీల కోణంలో నిర్మించారు. దాని గురించి ఎ ఒక్క ఇంజనీర్ కానీ అధికారిగానీ పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏడుగురు అధికారులను బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేశారు. మన దగ్గర ఎటువంటి చర్యలు ఉంటాయో వేచి చూడాలి అని బీజేపీ నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు.

## 2న ఏఐకేఎస్ జిల్లా మహాసభ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జూన్ 2వ తేదీన సారపాకలో ఏఐకేఎస్ జిల్లా మహాసభ నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు మండల మహాసభ వీరభద్రపురంలో కల్తి రామన్న అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభకు ముఖ్య వక్తగా గౌని నాగేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడని విమర్శించారు. దేశంలో రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. రైతులు పండించిన పంటలు మొత్తం తడిసి మార్కెట్‌లో నిల్వ చేసుకుని అమ్ముడుపోక బయట దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తుంధని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు లేవని, గిట్టుబాటు ధర లేదని, కొనే నాధుడే లేకుండా దళారీలను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఏఐకేఎస్ జిల్లా నాయకులు వల్లోజు రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్తి రామన్న, వల్లోజు రమేష్, బి గోపి, కూరాకుల నరసింహారావు, లిక్కి నరేష్, కల్తీ సురేష్, కల్తి లక్ష్మయ్య, జాతర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తాకి పాల వ్యాపారి మృతి



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి : ఎండ ప్రభావంతో వడదెబ్బ తాకి హుస్నాబాద్ పట్టణానికి చెందిన పాల వ్యాపారి బల్లు సంపత్ శనివారం మృతి చెందాడు. హుస్నాబాద్ పట్టణంలో పాల ప్యాకెట్లు ఇంటింటికి వేస్తూ అందరికీ సుపరిచితుడైన బల్లు సంపత్ రోజు లాగానే పాలు వేసి ఇంటికొచ్చి సేద తీరుతుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అంతలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.కుటుంబానికి పెద్ద దిక్కు అయిన సంపత్ మృతి చెందడంతో ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వడదెబ్బతో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్గ్రేషియా చెల్లించాలని పట్టణానికి చెందిన పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన మహబూబాబాద్ జిల్లా వాసి ప్రవీణ్




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా,మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని రామన్నపేట కాలనీకి చెందిన వయంతుల వెంకటేశ్వర్లు పద్మ దంపతుల కుమారుడు ప్రవీణ్. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలి విక్టోరియా ఆడిటోరియంలో జరిగిన కాంపిటీషన్ లో 22 దేశాల నుండి 2 వేల మంది మ్యూజిక్ కీ బోర్డ్ ప్లేయర్స్ పాల్గొనగా 777 మంది గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వయంతుల ప్రవీణ్ ప్రతిభ చూపెట్టి అవార్డు పొందడం మన మహబూబాబాద్ జిల్లా యువతకు గర్వకారణం.ప్రవీణ్ కృషి, పట్టుదల, అంకితభావం ఈ అరుదైన విజయాన్ని అందించాయి. మీరు సాధించిన ఈ ఘనత మరెందరో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాము.కలలను లక్ష్యాలుగా మార్చుకుని, లక్ష్యాలను విజయాలుగా మలిచిన మీ ప్రయాణం నిజంగా అభినందనీయం. ఇలాంటి మరెన్నో విజయాలను అందుకొని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,ప్రవీణ్ కు హృదయపూర్వక శుభాభినందనలు.తెలిపారు.

# సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం : రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని, ఆస్పత్రిని పునరుద్ధరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతోకాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ ఆస్పత్రిలో కొత్త వైద్యుల నియామకం చేపట్టకుండా, కేవలం ఇద్దరు స్టాఫ్‌తో మందులు ఇచ్చేలా యాజమాన్యం కుట్రపూరితంగా మార్చిందని మండిపడ్డారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో, కొత్తవారిని నియమించకుండా ఆస్పత్రిని ఏకంగా సీల్ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఆస్పత్రిని మూసివేయడం వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవలకు సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర భారంగా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం మొండివైఖరి వీడి తక్షణమే ఇక్కడ వైద్యులను, సిబ్బందిని నియమించి ఆస్పత్రిని యథావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటి డాగ్ 'రోలెక్స్' తనిఖీలు..




గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని ఎస్సై తెలిపారు. గాంజా లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించి ఉపయోగించేవారు ఉన్నా సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# పరిశ్రమలు ప్రజల సంక్షేమానికి సహకారం అందించాలి

* **కలెక్టర్ బి చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పరిశ్రమలు సామాజిక బాధ్యత గా ప్రజల సంక్షేమానికి తమవంతు సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శనివారం వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.30 లక్షల ఆర్థికసహాయాన్నిఅందించింది.ఈ సందర్భంగా శనివారం వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ తరపున హెచ్ఆర్ హెడ్ మోహన్ , ప్లాంట్ హెడ్ కొడాలి అచ్యుత, భాస్కర్ రావు , డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి,జిల్లా పరిశ్రమల కేంద్రం (DIC) జనరల్ మేనేజర్ సతీష్ తో కలిసి, ఈ ఆర్ ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధించిన సి ఎస్ ఆర్ చెక్కును జిల్లా కలెక్టర్ కు అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి జిల్లాలో ఉన్న వివిధ కంపెనీలు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.వి యాష్ కంపెనీ లాగే ఇతర కంపెనీలు సైతం ముందుకువచ్చి సామాజిక బాధ్యత గా సహకారం అందించాలని కోరారు.

# మన హక్కులు— మన గొంతు" నినాదంతో మాక్ పార్లమెంట్ నిర్వహణ

* **ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన స్నేహ కార్యక్రమం**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం, బాలల హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక సమస్యలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ సంఘాల సభ్యుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజా ప్రతినిధుల పాత్రలను పోషిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా నిర్వహించారు. సభా నిర్వహణ, చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరిచారు. మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల భద్రత, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై చర్చించారు. ప్రతి బాలుడు విద్యను పొందే హక్కు కలిగి ఉన్నందున చిన్నారులను పనుల్లో నిమగ్నం చేయకుండా పాఠశాలల్లో చేర్పించేందుకు సమాజం బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. బాలికల భద్రతకు సంబంధించి పోక్సో చట్టం, సైబర్ నేరాల నివారణ, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వంటి అంశాలపై మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సైబర్ వేధింపులు లేదా మోసాలు ఎదురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు.బాలికల రక్షణ, సంరక్షణ కింద బాల్య వివాహాల నిర్మూలనకు 1098 చైల్డ్ లైన్ నంబర్ లో సంప్రదించాలని, ఇంట్లో ఏమైనా సమస్య తలెత్తితే సఖి సహాయ కేంద్రం 181, పోలీస్ 100 కు డయల్ చేయాలని, అలాగే రాష్ట్రంలో గుట్కా, పొగాకు, గంజాయి విక్రయాలు, సరఫరాపై నిషేధం ఉందని, అలాంటి అలవాట్లకు ఎవరైనా బానిస అయితే, విక్రయాలకు ఎవరైనా పాల్పడితే ఈగల్ బృందం 1908 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూబాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ భద్రత, స్టాకింగ్ వంటి నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థుల్లో వక్తృత్వ నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యాలు, సమస్యలను విశ్లేషించే దృక్పథం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థినులకు ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలు, లక్ష్య సాధన కోసం అనుసరించాల్సిన మార్గాలపై ప్రత్యేక అవగాహన ఉండాలని తెలిపారు.తమ అభిరుచులు, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జెడ్పి సీఓ ఎల్లయ్య, డిఆర్.డి.ఓ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్ , బి డబ్ల్యు ఓ హేమా భార్గవి , అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై బురదజల్లే వారిని పట్టించుకోవద్దు..!

* **షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**



ప్రజస్ఫూర్తి, షాద్నగర్ : ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డుపై తప్పుడు ప్రచారం చేసే వారిని రైతు సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునీ బురద జల్లే వారిని పట్టించుకోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. షాద్ నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ సెక్రటరీ, కమీషన్ ఏజెంట్లతో షాద్ నగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల వద్ద నుండి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మార్కెట్ మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లించి కొనడం శుభసూచకమని అన్నారు. యాడుకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా అధికారులు పాలకవర్గం కమిటీ కమిషన్ ఏజెంట్లు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్ భరత్ లోహోటీ, రవి నాయక్, పి నర్సింలు, కక్కునూరు సందీప్ కుమార్, వెంకట నరసింహారెడ్డి, తాడిశెట్టి నవీన్, కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా, జగదీశ్వర్ గుప్తా , కొట్ర రాజు, సరపు మల్లేష్, సంజీవయ్య, పెంటయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

* **జిల్లా కలెక్టర్ కె.హరిత**



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: బాలికలు, మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రమీల లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళలు, బాలికల హక్కులపై అనేక చట్టాలు తీసుకువచ్చాయని, సమాజంలో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా అధికారులు కృషిచేయాలని తెలిపారు. మహిళలు, బాలికలు చట్టాలను గౌరవించాలని, బాల్య వివాహాలపై సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, విద్యార్థులు తాము చదువుకునే పాఠశాలలను దేవాలయాలుగా భావించాలని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లాస్ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ యు మండల కేంద్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధురాలు మెస్రం జిజాబాయి ఉల్లాస పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైన సందర్భంగా కలెక్టర్ సాలువాతో సన్మానించి అభినందించారు. మాక్ పార్లమెంట్ ద్వారా హక్కులు, చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న గిరిజన బీఈడీ పూర్వ విద్యార్థులు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యారంగంలో ఆదర్శవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గిరిజన పట్టభద్రుల సంక్షేమం కోసం 2000 సంవత్సరంలో స్థాపించబడిన భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో 200607 విద్యా సంవత్సరంలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సేవలందిస్తూ విద్యార్థుల ప్రగతికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఉపాధ్యాయులు తారాచంద్, శంకర్, నరసింహారావు, రమేష్, నరేష్, శ్రీనులు ఒక బృందంగా ఏర్పడి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చారు. కొత్తగూడెం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇటీవల నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ కల్పించాలని వారు భావిస్తున్నారు. గతంలో ఇదే కళాశాలలో చదివిన వివిధ ఐటీడీఏ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులను కూడా ఇలాంటి విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదయాల్ సేవలను వారు స్మరించుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహం కోసం పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆదర్శప్రాయమని పేర్కొంటున్నారు.

# నేడు ఆలయ కమిటీ ఏర్పాటు పై సమావేశం

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ మీటింగ్ నిర్వహించనున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ఎస్ ప్రతాప్ రెడ్డి లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్లో గుడి కమిటీలు మార్పులు చేర్పులు చేయుట, తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు ఈ సమావేశానికి కాలనీ పెద్దలు రాజకీయ నాయకులు మహిళలు సీనియర్ నాయకులు యువజన సంఘాలు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుర ప్రముఖులు వివిధ సంఘాల నాయకులు యువజనులు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# దాసి రెడ్డి గూడెం గ్రామంలో అంగన్వాడి బడిబాట కార్యక్రమం




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం అంగన్వా డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ రాపోలు సునీత మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడి పాఠశాలకు పంపించాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు అమ్మ మాట అంగన్వాడి బాట ఫ్లెక్సీ ని చేతబట్టుకుని గ్రామంలో చిన్నారులు తల్లులు ర్యాలీ నిర్వహించారు అర్హులైన చిన్నారులు అందర్నీ తప్పకుండా అంగన్వాడి కేంద్రానికి పంపించాలని అంగన్వాడి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీచర్ సునీత కోరారు ఈ కార్యక్రమంలో రాములమ్మ దివ్య ప్రసన్న పద్మ చిన్నారులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చివేస్తే భూసారం తగ్గిపోతుంది

* **రైతులకు అవగాహన కల్పించిన ఏ ఈ ఓ శ్రీలత**

అక్కన్నపేట, ప్రజాస్ఫూర్తి : అక్కన్నపేట మండలం రామవరం క్లస్టర్ పరిధిలోని హతీరం తండా గ్రామంలో వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై వ్యవసాయ విస్తరణ అధికార శ్రీలత రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే కొయ్యకాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నేలలో ఉండే వానపాములు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వంటి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. దీంతో నేలలో సేంద్రియ పదార్థం తగ్గిపోయి, భూసారం క్షీణించే ప్రమాదం ఉందన్నారు.అదేవిధంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు వాతావరణంలోకి విడుదలై పర్యావరణ కాలుష్యానికి దారితీస్తాయని, ప్రజల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.పంట అవశేషాల నిర్వహణలో భాగంగా రైతులు రోటవేటర్ వంటి యంత్రాల సహాయంతో వాటిని భూమిలో కలియదున్నాలని, అవశేషాలు త్వరగా కుళ్లేందుకు వేస్ట్ డికంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వినియోగించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.27 ప్రకారం పంట అవశేషాలను బహిరంగంగా కాల్చడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మిసోమ, ఉప సర్పంచ్ వినోద్ శ్రీరామ్ తండా సర్పంచ్ వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి సంపత్ వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్... వేడుకలు నిర్వహించే ప్రాంగణం, జెండా ఆవిష్కరణ స్థలం, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు చేశారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో జూన్ 5 నుంచి 12 వరకు నిర్వ హించనున్న పదో తరగతి సప్ల మెంటరీ పరీక్షలను ఎలాంటి అ వాంఛనీయ ఘటనలకు తావులే కుండా కట్టుదిట్టంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశిం చారు.శనివారం జిల్లా సమీకృత కలెక్టరే ట్‌లోని మినీ కాన్ఫ రెన్స్ హాల్‌లో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ పై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 151మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వర కు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. పరీక్షల నిర్వహణకు ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంటల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తాగు నీ రు, బెంచీలు,మూత్రశాలలు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చా లని ఆదేశించారు.పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను పోలీసు ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశితమార్గం లోనే తరలించాలని, పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్‌టికెట్ లను మాత్రమే అనుమతించాలని,ఎలక్ట్రాని క్ పరికరాలను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాల్లో సీ.సీ కెమెరాలు సక్రమంగాపని చేసేలా చర్య లు తీసుకోవాలని, ప్రతి విద్యార్థిని క్షు ణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రం లోకి అను మతించాలని తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నా రు.. విద్యుత్ సరఫరా నిరంతరాయం గా ఉండేలా చూడటంతో పాటు ప్రాథ మిక చికిత్స కిట్లు, అవసరమైన ఔషధా లు అందుబాటులో ఉంచాలని ఆదేశిం చారు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాల నిర్వహణను అత్యంత జాగ్రత్తగా చేపట్టి, పరీక్షలు ముగిసిన అనంతరం వాటిని పటిష్ట భద్రత నడు మ నిర్దేశిత కేంద్రాలకు చేరవేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ భీం శర్మ, ఏసీ జీఈ సత్య నారాయణ, జీసీడీఓ గౌసి యా బేగం, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, ఎన్‌పీడీసీఎల్ ఎస్.ఈ సంపత్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొ న్నారు.

## కర్మకాండ భవన నిర్మాణం కొరకు ఐదు లక్షల విరాళం

* ఆర్యవైశ్య పట్టణ అధ్యక్ష అభ్యర్థి కుక్కడపు శ్రీనివాస్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఈ నెల 31న ఆదివారం జరిగే ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి అహర్నిశలు శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అభ్యర్థిగా పోటీచేస్తున్న కుక్కడపు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రవి మహల్ లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తనకు అధ్యక్ష పదవి ఇస్తానని మాట తప్పారని, మా తండ్రి స్వాతంత్ర్య సమరయోధులుగా కుక్కడపు జానకి రామయ్య ఆర్యవైశ్యులందరికీ సుపరిచితుడని ఎన్నో ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేశారని, వారి కుమారుడిగా నేను ముందుకొస్తున్నానని తనను ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. ఆర్యవైశ్యులు కొందరు కిరాయి ఇండ్లలో ఉంటూ నివసిస్తు, కుటుంబ సభ్యులు చనిపోతే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని కర్మకాండల భవన్ నిమిత్తం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు. మీ అందరి వాడిగా సేవా దృక్పథంతో ముందుకు వస్తున్నానని కావున మీ అమూల్యమైన ఓటుతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కుక్కడపు జానకి రామయ్య, రాచర్ల వెంకటేశ్వరరావు, పాల్వాయి రవికుమార్, ఈగ వెంకటేశ్వర్లు, వెంపటి అజయ్, కర్నాటి రవి, వాసా నరసింహారావు, కర్నాటి వంశీ, శ్రీకాకుళపు చలపతిరావు,రాము, పోలా రాధాకృష్ణ, యామా ప్రభాకర్, గుడుగుంట్ల విద్యాసాగర్ రావు, తల్లాడ సోమయ్య,,చక్కా లక్ష్మయ్య, బొమ్మిడి శ్రీను, మొరిశెట్టి రాజా, వనమా శంకర్, అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



లింగాల ఘణపురం జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇ బ్బందులు కలగకుండా చర్యలు చేపట్టా లని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం లింగాల ఘణపురం మండలం లోని పటేల్‌గూడెం గ్రామంలో ఏర్పాటు చేసి న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కొను గోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రం లో ధాన్యం తూకం వేస్తున్న విధానం, రి కార్డుల నిర్వహణ, కొనుగోలు ప్రక్రియ పైఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం అకాల వర్షాల పరిస్థితులు ఉన్నందున రైతులు నష్టపోకుండా కొనుగోళ్లను వేగ వంతం చేయాల్సిన అవసరం ఉందన్నా రు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా గన్నీ సంచుల్లో నింపి వెంటనే మిల్లులకు తర లించాలని ఆదేశించారు.ట్రక్ షీట్లు, కొనుగోళ్ల రిజిస్టర్లు,తూకం వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రైతు వివరా లు, కొనుగోలు చేసిన ధాన్యం వివరాల ను ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు న మోదు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు,తూకం,లోడింగ్, రవాణా ప్రక్రియల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, అవసరమైన హమాలీ లు, వాహనాలు అందుబాటులో ఉంచి కొనుగోళ్ల ను త్వరితగతిన పూర్తి చేయా లని కలెక్టర్ ఆదేశించారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఎస్.ఐ ఖలీలుద్దిన్ ఖాన్, ఏ.ఎస్.ఐ లు మట్టయ్య, రమేష్, యాదగిరి, శేఖర్ రెడ్డి ల రిటైర్మెంట్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ పాల్గొని, రిటైర్ అవుతున్న అధికారులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు క్రమశిక్షణతో,అంకితభావంతో సేవలు అందించిన అధికారుల కృషి వల్లే సమాజంలో శాంతి భద్రతలు పటిష్టంగాకొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ, పగలు రాత్రి తేడా లేకుండా సేవలు అందించి, పూర్తి ఆరోగ్యంతో పదవి విరమణ పొందడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. పోలీసు ఉద్యోగం కేవలం ఒక విధి మాత్రమే కాకుండా ప్రజల పట్ల బాధ్యతతో కూడిన సేవ అని పేర్కొంటూ, రిటైర్మెంట్ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, పోలీస్ కుటుంబంతో అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రిటైర్ అవుతున్న అధికారులు తమ సేవా కాలంలో చూపిన నిబద్ధత యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంభం సభ్యులతో,ఆయురారోగ్యాలతో సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిచారు.అనంతరం రిటైర్ అయిన అధికారులకు జ్ఞాపికలు, శాలువాలు అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి సీఐ ఆది రెడ్డి,ఆర్.ఐ సంతోష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయ రాజు,పోలీస్ సిబ్బంది, రిటైర్ అవుతున్న అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

: అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్ర జా స్ఫూ ర్తి , భ ద్రా ద్రి కొత్తగూడెం:వచ్చేనెల 5వ తేదీ 12వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,399 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వారి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, న లు గు రు డి పార్ట్ మెం ట ల్ అధికారులు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షలు ముందురోజే తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవాలని, పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో విద్యుత్ సరఫరా, రవాణా, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాల విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మీ, వైద్యశాఖ ప్రతినిధి డాక్టర్ టి.ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, ఇల్లందు మున్సిపాలిటీ ప్రతినిధి డి. శ్రీనివాస్, ఆర్టీసీ ప్రతినిధి కె. మోహన్‌రావు, డీపీఓ కార్యాలయ ప్రతినిధి ఎస్. శ్రీనివాస్, పోస్టల్ శాఖ ప్రతినిధి ఎం.డి. అలీం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధి ఎం. అశోక్, పోలీసు శాఖ ప్రతినిధి పి.డి. క్రిస్టఫర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఎస్. మాధవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సూర్యాపేట 45వ వార్డు నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన నరేంద్రుని సత్యలక్ష్మి సోమన్న కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు. 45వ వార్డు నుండి నరేంద్రుని సోమలక్ష్మి, సోమన్న, యూత్ నాయకులు నరేంద్రుని హరీష్ కి గురువారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని సర్పంచ్ ఎన్నికలతో పాటు సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలలో 34 మంది కౌన్సిలర్లు గెలుపొందినట్లు మరో నలుగురు ఇండిపెండెంట్ లు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు.వారితో పాటు పార్టీలో చేరిన వారు కందిబండ తరుణ్, వెంపటి రవితేజ, అనిల్, రతన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట

* నల్గొండ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకారం అందిస్తాం
* నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్యశ్రీనివాస్‌రెడ్డి అన్నారు.నల్గొండ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం సాధారణ సమావేశం శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ అధ్యక్షుడు జరిగిందిఈ సమావేశంలో మేయర్ పాల్గొని మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేసే రైతులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్ కమిటీలు ఎంతో కృషి చేశాయని అన్నారు. నల్గొండ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. నల్లగొండ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని కనగల్ సబ్ మార్కెట్ యార్డులో రూ. 1.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ నిధుల ద్వారా గ్రామీణ, మండల ప్రాంతాలకు లింకు రోడ్డువేయడంజరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అన్నారు. తొలిసారిగా మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశానికి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి హాజరు కావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి,మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనాథ రాజు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వాడల జానయ్య, గంటకంపు సైదులు, ఆంజనేయులు, సుంకిరెడ్డి సైదిరెడ్డి, చిట్టిపోలు నాగయ్య, కుక్కడపు శ్రీను, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పంట పొలాల్లో అగ్నికీలలు..

* మంటల అదుపుకు ఫైర్ సిబ్బంది పోరాటం



మహదేవపూర్, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా పంట పొలాల్లో నిల్వ ఉంచిన కొయ్య కాళ్లకు మంటలు అంటుకోవడంతో అగ్ని వేగంగా వ్యాపించి పరిసర ప్రాంతాలను ఆవరించింది. మంటలు ఎగసిపడుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ సరిత వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టాయి.అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమిస్తూ మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు గ్రామ ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, గ్రామస్థులు కూడా అగ్నిమాపక సిబ్బందికి సహకరిస్తూ మంటలు ఆర్పేందుకు కృషి చేస్తున్నారు. అగ్నిప్రమాదంతో జరిగిన నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన అనంతరం నష్టంపై అధికారులు అంచనా వేయనున్నారు.

## మన హక్కులు – మన గొంతు" నినాదంతో ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

* హక్కులు, భద్రత, విద్య, అంశాల పై బాలికల చురుకైన చర్చలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని ప్రధాన సమావేశ మందిరంలో శనివా రం స్నేహ సంఘాల సభ్యులతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా లోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజాప్రతినిధుల పాత్రలను పోషిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరు ను అనుభవించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన,బాలకార్మిక వ్యవస్థ,బాలికల భద్రత,విద్య,ఆరోగ్యం, పారిశుద్ధ్యం వంటి అంశాల పై చర్చలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహ న కలిగి ఉండటంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పై అవగాహన పెంచడంలో మాక్ పార్లమెం ట్ వంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషి స్తాయన్నారు. డీసీపీ రాజమహేంద్ర నా యక్ మాట్లాడుతూ, పోక్సో చట్టం, సైబ ర్ భద్రత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాల పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.సోషల్ మీడి యా వినియోగంలో జాగ్రత్తలు పాటిం చాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నా రు. అనంతరం మాక్ పార్ల మెంట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బ హుమతులు, ప్రశంసాపత్రాలను అంద జేశా రు. కార్య క్ర మం లో డీఆర్డీఓ భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, అధికారులు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల దివ్యాంగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం

* కలెకర్ బి చంద్రశేఖర్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : వయో వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంజరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉద్దేశించి ప్రతినెలా చివరి శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న "ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని" సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.శనివారం జిల్లా కలెక్టర్కార్యాలయంలోని సమావేశ మందిరంలో వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉద్దేశించి నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వారి నుండి సమస్యల పరిష్కారమై సమర్పించిన దరఖాస్తులను స్వీకరించారు.ఈ ప్రత్యేక ప్రజావానికి (64) మంది వయో వృద్ధులు, దివ్యాంగులు హాజరై దరఖాస్తులు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఒక్కో పిర్యాదుదారు సమర్పించిన దరఖాస్తులను చదివి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.పిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు.

# గరిడేపల్లి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : భారీ నీటిపారుదల అండ్ సివిల్ సప్లై శాఖ మంత్రివర్యులు అయినటువంటి టైగర్ ఉత్తంకుమార్ రెడ్డి ఆశీస్సులతో గరిడపల్లి మండల సర్పంచులు ఫోరం అధ్యక్షుని ఎన్నిక గురించి చర్చించారు. సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ అధ్యక్షతన జరిగిన గరిడపల్లి మండల సర్పంచ్లుల ఫోరం అధ్యక్షుని ఎన్నుకున్నారు. దీనికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు పొనుగోడు సర్పంచ్ ఉపాధ్యక్షులుగా అరుణ రమేష్ గారకుంట తండా సర్పంచ్ ప్రధాన కార్యదర్శిగా కీసర వెంకటరమణ బుచ్చయ్య వెంకట్రాంపురం సర్పంచ్ వీరు తోపాటు పాత కార్యవర్గాన్ని కొనసాగించడమైనది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు త్రిపుర అంజరెడ్డి మాజీ ఎంపీపీ కటికం ఆశా రమేష్ మాజీ ఎంపీపీ రంగనాథ్ మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్ , వివిధ గ్రామ శాఖ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పరమేశ్ సందీప్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధాన్యం సేకరణ అధ్వానంగా ఉందన్నారు. దళారీలు, అధికారులు, ప్రభుత్వం మధ్య రైతులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా చేపట్టిన బస్సు యాత్రతోనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. 'కేంద్రం ధాన్యం తీసుకోవట్లేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు.. ధాన్యం సేకరణ రాష్ట్ర ప్రభుత్వం పని' అని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో 58.96లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం కుదిరిందని వివరించారు.

# పుష్కర మహోత్సవానికి ఆధ్యాత్మిక శోభ..

* **కాళేశ్వరంలో రఘువరేంద్ర తీర్థ స్వామీజీ పుణ్యస్నానం**





కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మిక వైభవంతో కళకళలాడుతోంది. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రంలోని భీమనకట్టె మఠాధిపతి, పరమపూజ్య శ్రీ శ్రీ రఘువరేంద్ర తీర్థ స్వామీజీ శనివారం కాళేశ్వరం చేరుకున్నారు.స్వామీజీ రాక సందర్భంగా ప్రభుత్వ అధికారులు, దేవస్థాన ప్రతినిధులు ఘన స్వాగతం పలికి పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం స్వామీజీ పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానం ఆచరించి, భక్తిశ్రద్ధలతో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాలు కేవలం నదీ స్నాన మహోత్సవం మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే దివ్య అవకాశమని పేర్కొన్నారు. కాళేశ్వరం క్షేత్రం శైవ, వైదిక సంప్రదాయాలకు నిలయమని, ఇక్కడ పుష్కర స్నానం చేయడం ద్వారా భక్తులకు పుణ్యఫలాలు, మానసిక ప్రశాంతత లభిస్తాయని అన్నారు.పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం, అధికారులు చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసనీయమని కొనియాడిన స్వామీజీ, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులు ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించాలని పిలుపునిచ్చారు.స్వామీజీ రాకతో కాళేశ్వరం పుష్కరాలకు మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు.




# కడియం శ్రీహరిని విమర్శించే నైతికకు బిజెపి నేతలకు లేదు

* **గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మారుజోడు రాంబాబు**

రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : దేవాదుల సృష్టికర్త... స్టేషన్ఘన్పూర్ అభివృద్ధి కోసం నిరంతర పాటుపడే కడియం శ్రీహరిని విమర్శించే హక్కు బిజెపి నేతలకు లేదని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు.. జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి లింగాల జగదీష్ చంద్ర రెడ్డి హెచ్చరించారు.. శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని మారు జోడు రాంబాబు ఇంటి వద్ద ఏర్పాటు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో ఎనిమిది మంది ఎంపీలు.. కేంద్ర మంత్రులు ఉన్నా కూడా రైతులకు మద్దతుగా ప్రకటించడంలో విఫలమయ్యారని వారు ఆరోపించారు.. రైతులకు గిట్టుబాటు ధర. మద్దతు ధర ప్రకటించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్ మాజీ ఎంపీపీ మేకల నరేందర్, వరలక్ష్మి, జిల్లా నాయకులు గాదే మహేందర్ రెడ్డి.. వెంకట్ రెడ్డి.. కడారి రవి... సర్పంచులు ప్రజాప్రతితులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాలయం వద్ద తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



కర్నూలు: తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారు. కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన వారిని ఉరవకొండకు చెందిన సంధ్య (22), హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర (5), సతీశ్ (35), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. వీరంతా బంధువుల ఇంట్లో సత్యనారాయణ వ్రతం కోసం వచ్చారు. అనంతరం ఈత కోసం నదిలోకి దిగి.. లోతు అంచనా వేయలేక గల్లంతయ్యారు. వీరి కోసం పోలీసులు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు.

# CBSE మార్కుల గందరగోళంపై విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం: కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో 2019 ఇంటర్ ఫలితాలను తారుమారు చేసిన గ్లోబరీనా అనే సంస్థ.. తన పేరు మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి కాంట్రాక్టును దక్కించుకుని, అంతకంటే పెద్ద గందరగోళాన్ని సృష్టించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. సీబీఎస్ఈ మార్కుల వ్యవహారంపై పోరాడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అధికారంలో ఉన్నవారిని వారు జవాబుదారీగా నిలబెడుతున్న తీరు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "గతంలో తెలంగాణలో గ్లోబరీనా వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. ముగ్గురు సభ్యుల కమిటీ నివేదిక ఆధారంగా.. సంబంధిత అధికారులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థపై కోర్టులో కేసు వేసింది. ఆ సంస్థ చరిత్రను సీబీఎస్ఈ విస్మరించింది. అసమర్థ సంస్థకు అనుకూలంగా ఉండేందుకే సీబీఎస్ఈ నిబంధనలను మార్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కేంద్రం, విద్యాశాఖ మంత్రి సమాధానం చెప్పాలి. ఇటువంటి వ్యవస్థపై దేశ భవిష్యత్తును నిర్మించలేం" అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.

# రాష్ట్ర హక్కుల పరిరక్షణకే.. తెలంగాణ రక్షణ సేన పుట్టింది: కవిత



మొయినాబాద్: ఏ లక్ష్యాల కోసం తెలంగాణను సాధించుకున్నామో.. వాటి సాధనతో పాటు రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండా పండుగ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. గతంలో భారాస, ప్రస్తుతం కాంగ్రెస్.. రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి గుదిబండగా మారిన జీవో 111 విషయంలోనూ మాట తప్పాయని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను ఎత్తేస్తామని హామీ ఇచ్చారు. యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేనలో చేరారు.

# బాల్క సుమన్ అరెస్ట్.. తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత




హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ ఉన్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గో బ్యాక్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆ తర్వాత పోలీసులతో బీఆర్ఎస్ న్యాయవాదులు మాట్లాడారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై నాంపల్లి పీఎస్‌లో నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని అబిడ్స్ ఏసీపీ తెలిపారు. పోలీసులు భారీగా మోహరించడంతో కొంత సేపటి తర్వాత బాల్కా సుమన్ తెలంగాణ భవన్ నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడిన తర్వాత అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

* **కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారు: బాల్క సుమన్**

"తెలంగాణ ఉద్యమంలోనూ నన్ను టార్గెట్ చేశారు. ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టి.. అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఇటీవల క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. అయినా, సరే ప్రజాప్రతినిధిగా ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నా. మరోసారి నన్ను జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయించారు. నన్ను జైల్లో పెట్టి పైశాచికానందం పొందాలని పాలకులు భావిస్తున్నారు. నాపై దృష్టి పెట్టే ముందు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. సింగరేణిలో వందల కోట్ల విలువైన స్కాములు జరుగుతున్నాయి. సింగరేణి కుంభకోణాలమయంగా మారిపోయింది. కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారు. చట్టంపై, వ్యవస్థలపై, రాజ్యాంగంపై నమ్మకం ఉంది. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులకు సహకరిస్తా. నేను ఎక్కడికీ పారిపోలేదు.. పార్టీ కార్యక్రమంలో ఉన్నా. ప్రశ్నించే నేతలను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది" అని బాల్క సుమన్ ఆరోపించారు.

# రూ.9 లక్షలు డిమాండ్.. ఏసీబీకి చిక్కిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆర్ఐ



హైదరాబాద్: లంచం కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. సైబర్ మోసం కేసులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు ఓ వ్యక్తిని ఆయన రూ.9 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి నుంచి ఇప్పటికే రూ.5 లక్షలు నగదు తీసుకున్నారు. మిగిలిన రూ.4 లక్షల కోసం బెదిరింపులకు పాల్పడినట్లు ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలోనే లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఇంట్లో సోదాలు నిర్వహించారు. రూ.13 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, స్థిరాస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

# పేదలతో గుడిసెలు వేయించి.. రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు రియల్టర్ల యత్నం



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ నార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది. సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిధి 59.11 ఎకరాలు కాగా.. ఇందులో ప్రభుత్వ శిఖం 20.23 ఎకరాలు, మిగతా అంతా పట్టాభూమి. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు చేపట్టరాదనే నిబంధల్ని ఉల్లంఘించిన రియల్టర్లు.. పేదల పేరుతో గుడిసెలు వేసి కొట్టేయాలని ప్రయత్నించారు. ఖాళీ చేయాలని రెండు నెలల సమయం ఇచ్చిన హైడ్రా .. హద్దులు నిర్ధారించి ఇవాళ ఫెన్సింగ్ వేస్తోంది. చెరువు మధ్యలో వేసిన కట్టను తొలగించింది.

# తీవ్ర వడగాల్పులు.. తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్: తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఇవాళ తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.



# గుబాళించే గులాబీ మల్లె!


**మల్లె అనగానే మనకు గుర్తొచ్చేది స్వచ్ఛమైన తెలుపు, గుబాళించే సువాసన. కానీ, ఈ పింక్ జాస్మిన్ ప్రత్యేకం. దీని మొగ్గలు ముదురు గులాబీ రంగులో ఉండి, విచ్చుకున్నాక లోపలి రేకులు తెల్లగా మారతాయి. అంటే ఒకే కొమ్మకు పింక్ అండ్ వైట్ కాంబినేషన్‌లో విచ్చుకుని కళ తెస్తాయి. మరి వీటిని మనం ఎలా పెంచుకోవచ్చో చూద్దామా!**

గులాబీ మల్లెని స్పానిష్, కాటలాన్, రాయల్ జాస్మిన్... అనే పేర్లతో పిలుస్తారు. జాస్మినమ్ గ్రాండీఫ్లోరమ్ దీని శాస్త్రీయ నామం. ఈ పూలు మొగ్గ దశలో ముదురు గులాబీ రంగులో ఉండి, విచ్చుకున్నాక తెల్లటి నక్షత్రాల్లా కనువిందు చేస్తాయి. అంతేకాదు, సూర్యాస్తమయం తర్వాత, ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడూ ఈ పూలు బాగా సువాసన వెదజల్లుతాయి. ఈ పూలు ఇప్పుడిప్పుడే మన దగ్గర కనిపిస్తున్నాయి కానీ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో ఎప్పటి నుంచో ఉన్నాయి. గులాబీ మల్లెని ఇంటి పెరట్లోని నేలలోనే కాదు... బాల్కనీలు, కుండీల్లో కూడా సులువుగా పెంచుకోవచ్చు. అయితే, దీనికి బలమైన ఆధారం ఇవ్వాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. ఈ మొక్క సాధారణ మల్లిలా కాకుండా వేగంగా పెరుగుతుంది. ఆ సమయంలో కొద్దిగా వర్మీ కంపోస్ట్ లేదా పశువుల ఎరువు కలిపితే బలంగా ఎదుగుతుంది. అలానే రోజూ దీనికి కనీసం 6 గంటల ప్రత్యక్ష సూర్యరశ్మి అవసరం. అయితే ఎండలు మరీ ఎక్కువగా ఉండే మే, జూన్ నెలల్లో మధ్యాహ్నం పూట కొద్దిగా నీడ ఉండేలా చూసుకోవాలి. కుండీల్లోని మట్టి ఆరిపోయినట్లు అనిపించినప్పుడు మాత్రమే నీళ్లు పోయాలి. ఎక్కువ పోస్తే వేర్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

**పెంచడం ఎలా?**

పూల సీజన్ అయిపోయాక ఎండిపోయిన కొమ్మలను, ఎక్కువైపోయిన తీగలను కత్తిరించాలి. దీనివల్ల మొక్కకు మంచి షేప్ రావడమే కాకుండా, వచ్చే సీజన్‌కు మరిన్ని ఎక్కువ మొగ్గలు వస్తాయి. పూలు పూసే సమయంలో పొటాషియం మోతాదు ఎక్కువగా ఉండే ఎన్‌పీకే ద్రవరూప ఎరువుని అందించాలి. నెలకోసారి ఆవు పేడ ఎరువును ఇస్తే మొగ్గలు బాగా వస్తాయి. బియ్యం కడిగిన నీటిని పోయడం వల్ల కూడా బలంగా ఉంటుంది. అయితే, దీన్ని తెల్లదోమ, తామరపురుగులు ఇబ్బంది పెడతాయి. ఇలాంటప్పుడు లీటరు నీటిలో ఒక చెంచా వేప నూనె కలిపి ఆకులపై పిచికారి చేస్తే సమస్య దూరమవుతుంది.











# కార్గోనే కావాలట!

కార్గో ప్యాంట్లు అనగానే గుర్తొచ్చేదేంటి? జేబులతో కూడిన మిలిటరీ దుస్తులే కదూ! పైగా మందంగానూ ఉంటాయి. ఇలాంటివి అమ్మాయిలకేం నచ్చుతాయి అనుకునేవారు ఒకప్పుడు. కానీ అవే ఈతరం అమ్మాయిల ఫేవరెట్‌గా మారాయి. బయటి నుంచి ఇంటికొచ్చాక ఏమనిపిస్తుంది... హాయిగా వదులుగా, గాలి ఆడేలా ఉండే దుస్తుల్లోకి మారాలనే కదూ. కాబట్టే, నైట్‌వేర్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటారు. అయితే ఏదైనా పని వచ్చినా, ఇంటికెవరైనా వచ్చినా దుస్తులు మార్చాల్సిందే! అంతేనా, పార్టీలు, ఆఫీసులు, లీజర్... ఇన్ని వేర్‌లతో వార్డ్‌రోబ్ నింపేసుకోవాలి. ఇన్ని ఉన్నా మళ్లీ సమయానికి ఏవీ లేవన్న భావన. అసలే ఫాస్ట్ ఫ్యాషన్ మీద విముఖత చూపిస్తోంది ఈ తరం. అలాంటివాళ్లు ఇన్నేసి దుస్తులు పోగేసుకోవాలి అనుకుంటారా? కాబట్టే, వాళ్ల ప్రాధాన్యం అవుతోంది 'కార్గో'! వదులుగా ఉండే ప్యాంట్లు స్టైల్‌గా కనిపించడమే కాదు... కావాల్సినంత సౌకర్యాన్నీ ఇస్తాయి. బ్లేజరో షర్టో వేస్తే ఆఫీస్ వేరవుతుంది. స్టైల్ లుక్ కావాలంటే టీషర్టులు. షార్ట్‌టాప్‌లు, ఓవర్‌సైజ్‌డ్ టీషర్టులు, కుర్తీలు... ఒకటా రెండా... ప్రతిదానితోనూ జత చేసేస్తున్నారు. అవసరం ఏదైనా అందుకు మేం సిద్ధం అంటున్నారు. అలా దేనికైనా నప్పేస్తూ... సౌకర్యాన్నీ ఇస్తూ ఉండే దుస్తులకు మించి ఎవరైనా కోరుకునేది ఏం ఉంటుంది చెప్పండి? కాబట్టే, కార్గో ప్యాంట్లు నేటి తరం అమ్మాయిల ఎంపికవుతున్నాయి. మరీ మందంగా ఉంటాయి కదా అన్నదానికీ జవాబుంది. కాటన్, లినెన్, స్పోర్ట్స్ వేర్, జీన్స్... దొరకని వస్త్రరకమే లేదు. అంటే ఏ కాలమైనా అనువే! రంగుల సంగతైతే చెప్పనక్కరే లేదు. ఇంకేం చక్కగా కొనేసుకుంటున్నారు. మీ దగ్గరుందా ఓ కార్గో? లేకపోతే తెచ్చేసుకోండి మరి. ఇంతకీ మీదే స్టైలో?



















# మట్టిలో ఫంగస్ ఎలా తగ్గుతుంది?

**మొక్కల్ని పెంచడం అంటే వాతావరణంతో సంబంధం లేకుండా రోజూ నీళ్లు పోయడమే అనుకుంటారు చాలామంది. అధిక తేమ వల్ల మట్టికి ఫంగస్(బూజు) పట్టొచ్చు. దీనివల్ల కొన్నిసార్లు మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటప్పుడు ఇంట్లోని ఈ సహజ సిద్ధమైన వస్తువులతో ఈ సమస్యను సులువుగా నయం చేయవచ్చు..**

బేకింగ్ సోడా: ఇది ఫంగస్‌ను నివారించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. లీటరు నీటిలో చెంచా బేకింగ్ సోడా, కొన్ని చుక్కల లిక్విడ్ సోప్ లేదా వేప నూనె కలపండి. ఈ మిశ్రమాన్ని ఫంగస్ పట్టిన మట్టి, మొక్కలు, ఆకులపై స్ప్రే చేస్తే చాలు.

దాల్చినచెక్క: దీనికి అద్భుతమైన యాంటీఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇది ఫంగస్‌ను చంపడమే కాకుండా మొక్కల వేర్లనూ రక్షిస్తుంది. మట్టిపై తెల్లటి బూజు కనిపించినప్పుడు అక్కడ కొద్దిగా దాల్చినచెక్క పొడి చల్లితే సరి. సమస్య దూరమవుతుంది.

పసుపు: ఫంగస్‌కు వ్యతిరేకంగా పసుపు బాగా పనిచేస్తుంది. నెలకోసారి చెంచా పసుపు మట్టిలో చల్లితే సరి. లేదా లీటరు గోరువెచ్చని నీటిలో చెంచా వేపనూనె, కొద్దిగా డిష్ వాష్ లిక్విడ్ కలిపి మట్టిపై స్ప్రే చేసినా ఫలితం ఉంటుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి...**

ఫంగస్ ఎల్లప్పుడూ తేమ, చీకటి ఉన్న చోట పెరుగుతుంది. కాబట్టి మొక్కను కొన్ని రోజుల పాటు ఎండ తగిలే చోట ఉంచండి. సూర్యరశ్మి సహజంగానే ఫంగస్‌ను నశింపజేస్తుంది. కుండీలోని పైమట్టిని ఏదైనా చిన్న కర్రతో అప్పుడప్పుడు కదుపుతూ ఉండాలి. దీనివల్ల గాలి తగిలి తేమ తగ్గిపోతుంది.

మట్టి పూర్తిగా ఎండిపోయే వరకు మళ్లీ నీరు పోయొద్దు. కుండీకి కింద నీరు పోవడానికి రంధ్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోండి. అంతే కాదు... ఫంగస్ చాలా ఎక్కువగా ఉంటే, ఆ పైమట్టిని తీసేసి, పైన చెప్పిన చిట్కాలను పాటించి కొత్త మట్టిని వేయండి. ఈ చిన్న చిట్కాలతో మీ మొక్కలను మళ్లీ ఆరోగ్యంగా మార్చుకోవచ్చు!

# ఈ వీకెండ్‌లో ఓటీటీలో వినోదమే.. కొత్త సినిమాలు/వెబ్‌సిరీస్‌లివే!













సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా, జగపతి బాబు, లైలా కీలక పాత్రల్లో నటించిన తెలుగు చిత్రం 'గోదారి గట్టుపైన'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చింది. ఇంజినీరింగ్ చదువుతున్న తన కూతురు ఓ ఆటోడ్రైవర్‌ని ప్రేమించిందని తెలిసిన ఆ తండ్రి ఏం చేశాడు? కూతురు ప్రేమని అంగీకరించాడా? తనకు నచ్చినట్టుగా మరొకరితో పెళ్లి జరిపించాడా? అన్నది చిత్ర కథ.

కమెడియన్ సత్య హీరోగా దర్శకుడు రితేశ్ రానా తెరకెక్కించిన చిత్రం 'జెట్లీ'. వెన్నెల కిశోర్, శ్రీనివాస్ రెడ్డి, వైవా హర్ష, అజయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రియా సింఘా కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్' వేదికగా వినోదాన్ని పంచుతోంది.

ధనుష్, మమితాబైజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కర'. యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. మే 28 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కె.ఎస్.రవికుమార్, పృథ్వీరాజన్ కీలక పాత్రల్లో కనిపించారు.

నిఖిలా శంకర్, రాజ్ అయ్యప్ప, బోస్ వెంకట్, గాయత్రి శాస్త్రి తదితరులు కీలకపాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్'. చిదంబరం మణివన్నన్ దర్శకుడు. తమ తండ్రికి తామే ప్రపంచం అని భావిస్తున్న పిల్లలకు.. నాన్నకు ఇంకొక కుటుంబం ఉందని తెలిస్తే..! వారి పరిస్థితేంటి? తండ్రి గురించి తెలిశాక ఆ కుటుంబంలోని తోబుట్టువులందరూ కలిసి ఏం చేశారు? అన్న కథాంశంతో వినోదాత్మకంగా ఈ సిరీస్‌ను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ప్రస్తుతం జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

## రణ్‌వీర్ సింగ్‌పై వివాదం
# స్పందించిన ఆర్జీవీ



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌పై ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (FWICE) మూడేళ్ల పాటు నిషేధం విధించడం దేశవ్యాప్తంగా సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ప్రతిష్టాత్మక 'డాన్3' సినిమా నుండి రణ్‌వీర్ తప్పుకోవడం వల్ల నిర్మాతలకు కోట్లలో నష్టం వాటిల్లిందనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వివాదంపై సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తూ రణ్‌వీర్ సింగ్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. ఎక్స్ వేదికగా ఆర్జీవీ సినీ ఎంప్లాయిస్ యూనియన్ వ్యవస్థపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రణ్‌వీర్‌ను కాదు.. ముందు FWICE ని బ్యాన్ చేయాలి" అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సినీ యూనియన్ వ్యవస్థ చాలా పాతబడిపోయిందని, పరిశ్రమలో తమ పట్టును కోల్పోకుండా ఉండటానికే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇది కార్మికుల రక్షణ కోసం చేస్తున్న పని కాదని కొట్టిపారేశారు. ఈ ఫెడరేషన్ అనేది ఎలాంటి కోర్టు లేదా ప్రభుత్వ నియంత్రణ సంస్థ కాదు.. ఇదొక 'కంగారూ కోర్ట్' లాంటిదని ఆర్జీవీ అభివర్ణించారు. రణ్‌వీర్ సాధిస్తున్న భారీ విజయాలను చూసి ఓర్వలేక, కొంతమంది ఒక అజెండాతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. రణ్‌వీర్ వల్ల ఐదు లక్షల మంది కార్మికుల పొట్ట కొట్టారనడం పెద్ద అబద్ధమని, ఇండస్ట్రీలో కార్మికుల జీవనోపాధి ఎప్పుడూ ఒక్క నటుడిపైనో లేదా ఒక్క ప్రాజెక్ట్ పైనో ఆధారపడి ఉండదన్నారు. ఇది కేవలం ఒక నిర్మాతకు, హీరోకు మధ్య ఉన్న ప్రైవేట్ కాంట్రాక్ట్ వివాదమని, దీనిని సివిల్ కోర్టులు చూసుకుంటాయని స్పష్టం చేశారు. "థియేటర్లలో టిక్కెట్లు అమ్మేది రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్స్ మాత్రమే, ఫెడరేషన్ కాదు. రణ్‌వీర్ లాంటి స్టార్స్ వల్లే లక్షలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతోంది. వారు ఉన్నారు కాబట్టే ఇండస్ట్రీ ఉంది, ఈ ఫెడరేషన్ కూడా ఉంది. రణ్‌వీర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆయన ఇంటి ముందు రేపు పొద్దున్నే ఒక కిలోమీటర్ పొడవున నిర్మాతలు బ్లాంక్ చెక్కులతో క్యూ కడతారు. కాబట్టి ఇద్దరి మధ్య ఉన్న సివిల్ వివాదంలోకి వేలు పెట్టకండి" అని ఆర్జీవీ హితవు పలికారు. గతంలో షారుఖ్ ఖాన్ నటించిన 'డాన్', 'డాన్ 2' చిత్రాల తర్వాత, 2023లో ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్‌తో 'డాన్ 3' ప్రకటించారు. కానీ ఇప్పుడు తలెత్తిన వివాదాల వల్ల రణ్‌వీర్ దీని నుండి తప్పుకోవడంతో బాలీవుడ్‌లో సరికొత్త చర్చకు దారితీసింది.

# కియారా షాకింగ్ కామెంట్స్
# 'హాయ్' అంటే కూడా నో!



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాలో కియారా అడ్వాణీ ఒక కీలక పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె టాక్సిక్ సెట్‌లో తన అనుభవాన్ని పంచుకున్నారు. సెట్‌లోకి అడుగుపెట్టగానే ఎవరికీ 'హాయ్, హలో' చెప్పొద్దని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తనకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని నటి వెల్లడించారు. "గీతూ ఒకసారి నాకు ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌కి రాగానే పూర్తిగా ఆ పాత్రలోనే ఉండాలి' అని అన్నారు. సాధారణంగా నేను సెట్‌లోకి రాగానే అందరినీ పలకరిస్తూ హాయ్, ఎలా ఉన్నారు, గుడ్ మార్నింగ్ అని చాలా ఉత్సాహంగా మాట్లాడే మనిషిని. కానీ ఆమె మాత్రం.. 'ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు. నువ్వు నేరుగా ఆ క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి. నీ టీమ్‌తో సహా ఎవరికీ హాయ్, హలో చెప్పడానికి వీల్లేదు. పూర్తిగా నీ పాత్రకు సంబంధించే ఆలోచించాలి' అని చెప్పారు. ఆమెకు ఉన్న నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా" అని కియార తెలిపారు. ఈ సినిమాలో తన పాత్ర కోసం కన్నడలో మాట్లాడటం కూడా తనకో పెద్ద సవాలుగా మారిందని కియార అన్నారు. ఎందుకంటే ఒకే సీన్‌ను మొదట ఇంగ్లిష్‌లో, ఆ తర్వాత కన్నడలో షూట్ చేసేవారని తెలిపారు. షూటింగ్‌కు ముందు రోజు రాత్రంతా కూర్చుని డైలాగులను బట్టీ పట్టాల్సి వచ్చేదని చెప్పారు. ఇక ఇందులో యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ నటిస్తున్నారు.

# 'పెద్ది': ఒక శక్తివంతమైన పాత్ర

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తాజా చిత్రం 'పెద్ది'లోని పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో తాను పోషించిన పాత్ర తన కెరీర్‌లోనే పూర్తి భిన్నమైనదని ఆయన తెలిపారు. ఈ సినిమాతో నటుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెల్లడించారు. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాతో చరణ్ మాట్లాడారు.

"పెద్ది సినిమాలో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయలేదు. ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ సినిమాలో చాలా మంది గొప్ప నటులతో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం దొరికింది" అని రామ్ చరణ్ వివరించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటన అద్భుతంగా ఉంటుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.




ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ, రామ్ చరణ్ గురించి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో చరణ్ మూడు రకాల క్రీడలు (కుస్తీ, క్రికెట్, రన్నింగ్) ప్రదర్శించారని, నాలుగో 'ఆట'గా డ్యాన్స్‌తో అదరగొట్టారని తెలిపారు. గుర్తింపు కోసం ఒక వ్యక్తి ఎంత దూరమైనా వెళ్లగలడని ఈ సినిమా నిరూపిస్తుందని బొమన్ ఇరానీ అన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో నటిస్తుండగా, సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ వ్యాఖ్యలు అంచనాలను మరింత పెంచుతున్నాయి.

## 'సేవ్ ది టైగర్స్3'..
# ఈసారి నవ్వులు మూడింతలు

"ఎవడ్రా చెప్పింది 'పెళ్లంటే పండు వెన్నెల.. పెళ్లామంటే నిండు పున్నమి'' అని ప్రశ్నిస్తున్నాడు అభినవ్ గోమఠం. ప్రియదర్శి, చైతన్యకృష్ణతో కలిసి ఆయన నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ వెబ్‌సిరీస్ 'సేవ్ ది టైగర్స్3'. ఇప్పటివరకూ రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది. నిత్య జీవితంలో భార్యభర్తల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలనే సరదాగా తెరపై ఆవిష్కరించిన తీరు కడుపుబ్బా నవ్వించింది. ఇప్పుడు వినోదం పాళ్లు మరింత పెంచి సీజన్3ని తీసుకొస్తున్నారు. జియో హాట్‌స్టార్ వేదికగా 'సేవ్ ది టైగర్స్3' జూన్ 19వ (save the tigers 3 release date ott) తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ట్రైలర్ విడుదలైంది. తాజాగా సిరీస్‌ను దేవుడితో ముడిపెడుతూ సన్నివేశాలను తీర్చిదిద్దారు. ఇంద్రుడిగా వెన్నెల కిషోర్ నటన, సంభాషణలు అలరిస్తున్నాయి. చివరిలో 'పెళ్లి అనేది గాలికి వెళ్లిపోయే ముళ్లకంప అని తెలిసినా, ఎగిరి ఎగిరి మరీ అడ్డం పడతారు. ఆ తర్వాత ముళ్లు లాక్కోలేక ఏడుస్తారు' అన్న వెన్నెల కిషోర్ డైలాగ్ నవ్వులు పూయిస్తోంది.





# తల్లిదండ్రులు కాబోతున్న అనుష్క ఆదిత్య!

ముంబయి: బాలీవుడ్ చిత్రసీమలో అత్యంత ఆకర్షణీయమైన జంటగా, క్యూట్ కపుల్‌గా పేరు తెచ్చుకున్న అనుష్క రంజన్ ఆదిత్య సీల్ దంపతులు తమ జీవితంలో అత్యంత మధురమైన ఘట్టంలోకి అడుగుపెడుతున్నారు. తాజాగా ఈ జంట తమ కుటుంబంలోకి కొత్త అతిథి రాబోతున్న విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. సరికొత్త ప్రయాణం.. తమ సంతోషాన్ని వ్యక్తపరిచేలా అనుష్క రంజన్ ఆదిత్య సీల్ దంపతులు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని క్యూట్ ఫోటోలను పంచుకున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.